


# పుస్తక పరిచయం




For Copies:
All Major Bookshops
80085 99901
Price:Rs. 1000 / $ 30

**కొంతమంది ప్రముఖుల గురించి** ఎంత చెప్పినా కొంత మిగిలిపోతూనే ఉంటుంది, కొన్ని అంశాల గురించి ఎంతమంది వ్రాసినా మరికొంత మిగిలిపోతూనే ఉంటుంది. అలాంటి ప్రముఖుడు సినీదర్శకుడు కళాతపస్వి శ్రీ కాశీనాథుని విశ్వనాథ్‌గారు. వారు రూపొందించిన సినిమాలు – విశ్లేషించిన కొద్దీ విశేషాలు కనిపించే అనుభూతుల గనులు. విశ్వనాథ్‌గారి గురించి, వారి సినిమాల గురించి దశాబ్దాలుగా ఎంతో మంది ఎన్నో వ్రాశారు.. 'వ్రాసేశారు' అనడం సరికాదు. ఎందుకంటే ఆయన తీసిన సినిమాల గురించి ఎంతమంది ఎన్నిసార్లు వ్రాసినా, మనసుపెట్టి చూసే ప్రతివారికీ ఆ సినిమాల్లో ఎప్పుడు ఏదో ఒక కొత్తకోణం కనిపిస్తుంది. అలాంటి అపరిచిత కోణాల్లోంచి చూస్తూ విశ్వనాథ్‌గారి చిత్రాల గురించిన విశ్లేషణా గ్రంథం ఈ 'విశ్వనాథ్ విశ్వరూపం.' ముందుమాటలో విశ్వనాథ్ గారు చెప్పినట్లు 'ఇది అంత తేలికైన – రచన కాదు. ఏ రామాయణానికో అంతరార్థ రామాయణం రాసినంత కష్టతరమైనది'. ఇంత కష్టతరమైన, క్లిష్టతరమైన ప్రణాళికకు ఈ రూపం ఇచ్చింది ఏ జర్నలిస్టో, ప్రొఫెషనల్ సినీ విశ్లేషకులో కాదు – నాలుగు దశాబ్దాలు పైగా సాంకేతిక రంగంలో ఉన్నతోద్యోగాలు చేసిన డా.ఎ.ఎస్.రామశాస్త్రిగారు. వీరు 'అనామకుడు' కలం పేరుతో తెలుగు పాఠకులకు చిరపరిచితులే. వారి మాటల్లోనే చెప్పాలంటే ' ఆయన చిత్రాల్లో చూపించినవన్నీ నేనెలాగూ చూపించలేను. అందుకని నేనెన్నో సార్లు చూసుకుని ఆనందించిన చిత్రాలనూ సన్నివేశాలనూ ఎన్నుకున్నాను. ఈ ఎంపికలు నా అనుభూతికి సంబంధించినవి'. అలా ఎంపిక చేసిన అంశాలతో పదికాలలు నిలిచేలా ఒక పరిశోధనా సిద్ధాంత గ్రంథంలా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు 'అనామకుడు'గారు. 'పది'కాలాలు నిలవాలి కాబట్టి ఈ పుస్తకంలోని ప్రతి అధ్యాయంలోనూ విశ్వనాథ్‌గారి చిత్రాలకు సంబంధించిన ఒక్కోకోణంలో పదేసి అంశాలను విశ్లేషిస్తూ విశదీకరించారు. ఉదా: విశ్వనాథ్‌గారి చిత్రాల్లోని పది ప్రత్యేకతలు , శంకరాభరణం చిత్రాన్ని పదికోణాల్లో చూపించడం, విశ్వనాథ్‌గారి పదిచిత్రాల విశ్లేషణ( శంకరాభరణానికి అటూ ఇటూ ఐదేసి – వెరసి పది– చిత్రాలు, పదిచిత్రాలు – పదిపాటలు.. ఇలా. రచయిత వ్రాసిన ఏ అంశాన్ని చదువుతున్నా ఆయన ఎంతగా ఆస్వాదించి, అనుభూతించి వ్రాశారో అవగతమౌతుంది. ఇంతవరకూ విశ్వనాథ్‌గారి సినిమాల గురించి వచ్చిన పుస్తకాలు , వ్యాసాలకు పూర్తిగా భిన్నమైన గ్రంథం ఇది. ఏ అధ్యాయంలో ఏ సినిమా గురించి, ఏ సన్ని వేశం గురించి చదువుతున్నా మళ్ళీ ఓసారి ఆ చిత్రం చూసిన భావం కలుగుతుంది. మనం అనుకున్నవో, అనుకోనివో అనేక విశ్లేషణలు చదువుతుంటే, మళ్ళీ ఓసారి ఆయా సినిమాలు వెంటనే చూడాలనిపిస్తుంది. అది విశ్వనాథ్‌గారి సినిమాల మాయాజాలం. వాటికి అంత ఆసక్తిరంగానూ అక్షర రూపమిచ్చిన రచయితగారి అభిరుచీ, రచనా శైలీ కూడా. విశ్వానాథ్‌గారి అభిమానులకు ఈ 250 పేజీల పుస్తకం ఓ విందుభోజనం. ★★★